క్లుప్తంగా

భీమన్నకు బోనాలు



పూజలు చేస్తున్న మహిళలు

పెంచికల్‌పేట్‌: మండలంలోని అగర్‌గూడ అటవీ ప్రాంతంలోని భీమన్న గుట్ట వద్ద ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగ నిర్వహించారు. భాజభజంత్రీలు, డప్పుచప్పుళ్లతో గ్రామస్తులు గుహ వద్దకు చేరుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పంటలు బాగా పండాలని గ్రామాన్ని కాపాడాలని భీమన్న దేవుడిని వేడుకున్నారు. బోనాలతో పెద్ద ఎత్తున మహిళలు తరలిరావడంతో గుహ వద్ద సందడి నెలకొంది.

పద్మశాలి సంఘం ఎన్నికల నిర్వహణ కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌: పద్మశాలి సేవా సంఘం ఆసిఫాబాద్‌ పట్టణ కమిటీ ఎన్నిక కోసం ఎన్నికల నిర్వహణ కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో నియమించారు. కమిటీ చైర్మన్‌గా చెన్నూరి ప్రకాశ్‌, సభ్యులుగా మామిడాల తిరుపతయ్య, అనుమాండ్ల రవీందర్‌, బోగ మధూకర్‌లను నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, సామల రాజయ్య, వెంకన్న, మురళీప్రసాద్‌, లింగయ్య, ఏసయ్య, ధర్మయ్య, అంజన్న, మధుసూధన్‌ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

రెబ్బెన: జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌ రావు జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌ వద్ద కేక్‌ కట్‌ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌, నాయకులు రమేశ్‌, సుదర్శన్‌గౌడ్‌, చిరంజీవిగౌడ్‌, దేవాజీ, రాజేష్‌, గోపి పాల్గొన్నారు.

అంబేద్కర్‌ భవన్‌ నిర్మాణానికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్‌ భవనం నిర్మాణానికి కృషి చేయాలని మండల దళిత సంఘాల నాయకులు ఖానాపూర్‌ ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యలయంలో గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్‌ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, అంబేద్కర్‌ మెమోరియల్‌ అసోసియేషన్‌ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్‌, కామ్‌రాజ్‌ వాగ్మరే, సందీప్‌, ఉత్తం, ఎండీ జహిర్‌, సోమోరే నాగోరావ్‌ పాల్గొన్నారు.

24న బస్సు పాస్‌ల మేళా

ఇంద్రవెల్లి: దివ్యాంగులకు ఈనెల 24న బస్సు పాస్‌ల మేళా నిర్వహించనున్నట్లు ఉట్నూర్‌ బస్సు డిపో సూపరింటెండెంట్‌ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాంనగర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంప్‌ నిర్వహించి 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం




ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

బోథ్‌: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్‌ బాపూజీ విగ్రహావిష్కరణకు రావాలని బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ను పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ఆహ్వానించారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గంగుల మల్లేష్‌, మెరుగు భోజన్న, సురేందర్‌, దేవిదాస్‌, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్‌ టెస్ట్‌కు స్పందన

బోథ్‌: మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే భగత్‌సింగ్‌ జయంతిని పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు టాలెంట్‌ టెస్ట్‌ నిర్వహించారు. ఈ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించింది. భగత్‌ సింగ్‌ జయంతి రోజున విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సుమేర్‌ పాషా అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ మాజీ నాయకులు సిరిపురం దాస్‌, ప్రేమ్‌, మున్సిఫ్‌, నరేశ్‌, కార్తీక్‌, సంతోష్‌, ముఖ్రామోద్దిన్‌, రాజు, రవి, అజయ్‌, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు..!



నీరు అందక ఎండిపోయిన వరి



నిండుకుండలా బొక్కివాగు ప్రాజెక్టు



బొక్కివాగు ప్రాజెక్టు తూము

- చెడిపోయిన బొక్కివాగు తూము గేటు
- కాలువల్లోకి చేరని నీరు
- ఎండిపోయే దశలో సాగునీరు

పెంచికల్‌పేట్‌: బొక్కివాగు ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా.. వరి పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. ప్రాజెక్టు కింద సుమారు 500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని పంట పొలాలకు మళ్లించి వానాకాలం, యాసంగి సీజన్‌లో పంట సాగు చేస్తున్నారు. నెల రోజుల క్రితం ప్రాజెక్టు కుడి కాలువ వద్ద గల తూము గేటు వాల్వు చెడిపోవడంతో ప్రాజెక్టు నుంచి కాలువలకు తక్కువ నీరు వస్తుంది. కాలువల ద్వారా వస్తున్న నీరు చివరి ఆయకట్టు రైతులకు అందకపోవడంతో పంటు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2వేల ఎకరాల ఆయకట్టు..

ఎల్లూర్‌ వద్ద 2012 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రెండు వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు బొక్కివాగు ప్రాజెక్టు నిర్మించింది. ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఎల్లూర్‌, పెంచికల్‌పేట్‌, గన్నారం శివారులకు, ఎడమ కాలువ ద్వారా మెరెగూడ, కోయచిచ్చాల, ఎల్లూర్‌ శివారుల్లోని వ్యవసాయ భూములకు నీటిని అందిస్తున్నారు. గడిచిన కొన్ని ఏళ్లుగా ప్రాజెక్టు తూములకు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో చెడిపోయాయి. దీంతో కాలువల ద్వారా పంట పొలాలకు నీరు చేరడం లేదు. అధికారులు స్పందించి ప్రాజెక్టు తూములకు మరమ్మతులు చేసి కాలువల ద్వారా పంట పొలాలకు చేరేలా చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేయాలి



ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటిని సరఫరా చేసే తూములు గత రెండు ఏళ్ల క్రితం చెడిపోయాయి. నెల రోజుల నుంచి కుడి కాలువకు ప్రాజెక్టు నుంచి సరిపడా నీరు అందడం లేదు. కింద సాగు చేసిన పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేయించాలి.

– గట్టు లక్ష్మీనారాయణ, రైతు, ఎల్లూర్‌

ఎకరం వరి ఎండింది



ప్రాజెక్టు కింద రెండు ఎకరాల వరి సాగు చేశాను. నీరు అందక సుమారు ఎకరం పొలం ఎండిపోయింది. తూము గేటు వాల్వ్‌ చెడిపోవడంతో ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా.. కాలువల్లోకి రావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లోకి నీరు వచ్చేలా చూడాలి.

– పొట్టి శ్రీనివాస్‌, రైతు, పెంచికల్‌పేట్‌

అ'పూర్వ' సమ్మేళనం



కౌటాల: కౌటాల మయూరి విద్యాలయంలో 2012– 13 పదో తరగతి బ్యాచ్‌ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు అంతా ఒకచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తరగతి గదిలోని అనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ గురువులు విఠల్‌, తిరుపతి, రాందాస్‌, నాగభూషన్‌, సోమ్‌దాస్‌, రాము, శ్రీనివాస్‌, స్రవంతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యులకు 50 శాతం తగ్గింపు



మాట్లాడుతున్న శివకుమార్‌

కాగజ్‌నగర్‌ రూరల్‌: ఎక్స్‌ సర్వీస్‌మెన్‌ అసోసియేషన్‌ సభ్యులకు పట్టణంలోని రుద్ర ఆస్పత్రిలో చికిత్స పొందితే 50 శాతం తగ్గింపు ఇస్తున్నారని అసోసియేషన్‌ అధ్యక్షుడు శివకుమార్‌ అన్నారు. ఆదివారం మండలంలోని ఈజ్‌గాంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ ఆర్మీ సభ్యులు మృతి చెందితే తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 10 వేల రూపాయలను కుటుంబసభ్యులకు అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా అసోసియేషన్‌ తాత్కాలిక హాల్‌ను ఈజ్‌గాంలో బికాస్‌ గరామి, అమిత్‌ బిశ్వాస్‌, అమిత్‌దాస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 18న ఆదిలాబాద్‌లో సైనిక్‌ బోర్డు కార్యాలయం ప్రారంభించడం సంతోషకరమైన విషయమని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



గణేశ్‌ శోభాయాత్ర వెంటే పోలీస్‌ వాహనం

- పండుగ వాతావరణంలో ఉత్సవాలు
- సత్ఫలితాలిచ్చిన పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు
- ప్రశాంతంగా గణేశ్‌ నిమజ్జనాలు

కౌటాల: 'మీ భద్రతే.. మా బాధ్యతంటూ.. రాత్రి, పగలు పోలీసులు విధులు నిర్వర్తించి, ఇటీవల గణపతి నవరాత్రులను ప్రశాంతంగా ముగించారు. ఈసారి కౌటాల పోలీస్‌ సర్కిల్‌ పరిధిలో వినాయక ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉత్సవాలకు కొద్ది రోజుల ముందు నుంచే వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇక నిమజ్జనాల వేళ పక్కా ప్రణాళికలు రూపొందించి, ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా చూశారు.

మొదటి నుంచే..

గణేశ్‌ నవరాత్రులు అంటే అందరికీ సంబురమే. కానీ అప్పటికే జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల పోలీస్‌శాఖకు సవాలు విసిరాయి. గణేశ్‌ ఉత్సవాల ముందు జిల్లాలోని జైనూర్‌లో అనుకొని సంఘటనల నేపథ్యంలో మూడు రోజుల పాటు ఇంటర్‌నెట్‌ బంద్‌తో పాటు జైనూర్‌ ప్రాంతంలో రోజుల తరబడి రోడ్డు మీదనే కంటికి కునుకు లేకుండా విధులు నిర్వర్తించారు. వెంటనే గణేశ్‌ ఉత్సవాల నేపథ్యంలో పక్కా ప్రణాళికతో వారం పది రోజుల ముందు నుంచే శాంతి కమిటీల సమావేశాలు, యువతతో పాటు గణేశ్‌ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఊరేగింపులో డీజేలకు అనుమతి ఇవ్వలేదు. బాణసంచాలు కాల్చవద్దని, ఊరేగింపులో కత్తులు, మారణాయుధాలు, మండే పదార్థాలు తీసుకెళ్లవద్దని హెచ్చరించారు.

ప్రశాంత వాతావరణంలో..

ప్రతి ఏటా వినాయక విగ్రహాల నిమజ్జనంలో నిర్లక్ష్యం కారణంగా పలువురు మత్యువాత పడిన ఘటనలున్నాయి. కానీ ఈసారి కౌటాల సర్కిల్‌ పరిధిలో ఎలాంటి అవంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈఏడాది జిల్లాలోని 15 మండలాల పరిధిలో అధికారికంగా మొత్తం 873 వినాయక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా పోలీసులు ముందు నుంచి ప్రణాళిక ప్రకారం బ్లూకోల్ట్‌ సిబ్బంది వద్ద ఉన్న ట్యాబ్‌లో గణపయ్య మండపం ఫొటో తీసి ఆన్‌లైన్‌ ద్వారా జియో ట్యాగింగ్‌ చేశారు. కౌటాల సర్కిల్‌ పరిధిలో దాదాపుగా 200లకు పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ ఇబ్బంది తలెత్తకుండా డీజేలను నియంత్రించారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్‌, సిర్పూర్‌(టి) మండలాల్లోని ప్రశాంతంగా పండుగలను జరుపుకునేందుకు తమ సంతోషాలను సైతం పక్కన పెట్టి విధులు నిర్వహించిన పోలీసులను ఆయా మండలాల్లోని ప్రజలు శభాష్‌ పోలీసన్నలు అంటున్నారు.

అందరి సహకారంతోనే..



ఈసారి వినాయక నవరాత్రులకు ముందు జిల్లా ఏర్పాడిన పరిస్థితులను అనుగుణంగా కౌటాలలో వినాయక ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాం. మొదటి నుంచి నిమజ్జనం వరకు అన్నివర్గాల ప్రజలు కూడా సహకరించారు. సమిష్టిగా అందరి సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకున్నాం. ఇదే స్ఫూర్తితో మండల వాసులు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆకాంక్షిస్తున్నాం.

– ఎస్‌. మధుకర్‌, ఎస్సై, కౌటాల

బాబోయ్‌ వీధికుక్కలు..

- వృద్ధులు, చిన్నపిల్లలపై దాడులు
- ఒక్కరోజే 9 మందిపై..
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పులికుంటలో సంచరిస్తున్న వీధికుక్కలు

రెబ్బెన: మండలంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రతీ రోజు ఏదో ఒక గ్రామంలో ప్రజలను కుక్కలు కరుస్తున్నాయి. వీధి కుక్కలు రోడ్ల వెంట సంచరిస్తూ అటు వైపుగా వచ్చిన వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు, చిన్నారులు రోడ్డుపైకి రావాలంటేనే వణుకుతున్నారు. వీధికుక్కను చూస్తే చాలు పరుగులు తీయాల్సిన పరిస్థితులు గ్రామాల్లో నెలకొన్నాయి. అయినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల కుక్కకాటు బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ వాటిని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ఒక్క రోజే 9 మందికి గాయాలు..

గ్రామాల్లో వీధి కుక్కల బెడద స్థాయిలో ఉందో ఆదివారం వాటి కాటుకు గురైన వారి సంఖ్యను చూస్తే తెలుస్తోంది. ఆదివారం ఒక్కరోజే గోలేటి, కైరిగూడ, నంబాల గ్రామాల పరిధిలో 9 మంది వీధికుక్కల కాటుకు గురయ్యారు. గడిచిన కొన్ని నెలలుగా స్థానిక పీహెచ్‌సీలో నమోదు అవుతున్న కుక్కకాటు కేసులు అధికంగా ఉంటున్నాయి. రోజు రోజుకూ వీధి కుక్కల సంఖ్య అధికమవుతుండటంతో చిన్న పిల్లలు, మహిళలు రోడ్డు వెంట నడవాలంటేనే జంకుతున్నారు. వాహనదారులపై, కాలనీల్లో ఒంటరిగా వెళ్లే మహిళలపై, చిన్న పిల్లలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలను అరికట్టాలి



గ్రామాల్లో వీధి కుక్కలను పూర్తిస్థాయిలో అరికట్టాలి. కుక్క బారిన పడి ఎంతో మంది గాయపడుతున్నారు. కుక్కలను అరికట్టడంతో పంచాయతీ అధికారులు విఫలం అవుతున్నారు. ఇటీవల పంచాయతీ అధికారులు వీధికుక్కలను పట్టించామని చెప్పుతున్నా.. గోలేటిలో కుక్కల బెడద అధికంగా ఉంది.

– రాయిల్ల నర్సయ్య, గోలేటి

సిబ్బంది స్పందించాలి



వీధి కుక్కలను అరికట్టేందుకు అన్ని పంచాయతీల్లో సిబ్బంది వెంటనే స్పందించాలి. రోడ్డు వెంట తిరగాలంటే ప్రజలు భయపడుతున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా కుక్కలు దాడి చేసి గాయాలు చేస్తున్నాయి. దీంతో ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. పంచాయతీ సిబ్బంది కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– దుర్గం రవీందర్‌, గోలేటి

ఆందోళన చెందవద్దు

కుక్కకాటుకు గురైన వ్యక్తులు ఆందోళనకు గురికాకుండా వెంటనే అందుబాటులో ఉన్న ఆసుపత్రికి వెళ్లి కుక్క కాటు టీకాలు వేయించుకోవాలి. కుక్క కరిచిన చోట వెంటనే శుభ్రపర్చాలి. కట్టు లాంటివి కట్టకుండా వైద్యం చేయించుకోవాలి. నాటు వైద్యం వంటి పాతపద్ధతుల జోలికి వెళ్లావద్దు.

– సుజిత్‌, పీహెచ్‌సీ వైద్యాధికారి

న్యాయం జరిగే వరకు పోరాడుతా..

కాగజ్‌నగర్‌రూరల్‌: తనకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని బాధితురాలు రీమా వేణు యాదవ్‌ అన్నారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ఎన్టీఆర్‌ చౌక్‌లో ఈనెల 20న రాత్రి జరిగిన ఘటనపై సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. పోలీసుల వైఫల్యంతో కాగజ్‌నగర్‌లో గుండాయిజం పెరిగిందని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే తనపై దాడి జరిగినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తన వ్యక్తిగత వీడియోలను కొంతమంది వైరల్‌ చేస్తున్నారని, గత నెల 18న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు సరిగా స్పందించలేదని, కేవలం నామమాత్రంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి వదిలేశారని మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే తనపై దాడి చేసిన నవీన్‌గౌడ్‌, వంశీ, శివ, భరత్‌లపై సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్‌ మండలంలోని కరంజి(టి) గ్రామంలో ఆదివారం గ్రామ దేవత మంద పోచమ్మకు కరంజి(టి) గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పాడిపంటలు సుభిక్షంగా పండాలని, పశుసంపద వృద్ధి, గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రతీ మూడేళ్లకు ఒకసారి పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామ బస్టాండ్‌ వద్ద ఉన్న మంద పోచమ్మకు డప్పుచప్పుల మధ్య పూజలు నిర్వహించగా.. మహిళలు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ మహాజన్‌ విఠల్‌ దేశ్‌ముఖ్‌, నారాయణ, ప్రతాప్‌, కల్పప్‌ యాదవ్‌, రైతులు పాల్గొన్నారు.

'రిజర్వాయర్‌ భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి'



మాట్లాడుతున్న మల్లేశ్‌

తాంసి: పిప్పల్‌కోటి శివారులో నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో సాగుభూములు కోల్పోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం మండలంలోని పిప్పల్‌కోటిలో గ్రామశాఖ రెండో మహాసభలు నిర్వహించారు. గ్రామశాఖ కార్యదర్శిగా దోనిపెల్లి స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్‌ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌ ధరలో ఉన్న విధంగా పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న,నాయకులు స్వామి, రాజన్న, ఎస్‌.కె.హైదర్‌, తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని మరింత బలపర్చాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు



సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

నేరడిగొండ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరింత బలపర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్‌ కోరారు. ఆదివారం మండలంలోని నారాయణ్‌పూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కృషితో గతంలో 12 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అవతరించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, సాబ్లే సంతోష్‌ సింగ్‌, పరుశురాం, లక్ష్మణ్‌, తారాసింగ్‌, కర్తార్‌ సింగ్‌, సౌందర్య, న్యాల్‌సింగ్‌, అమర్‌సింగ్‌, రాంసింగ్‌, విజయ్‌, జ్ఞాన్‌సింగ్‌, జగదీష్‌, గణపతి పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని దేవాపూర్‌ గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు దాతాజీ కిరణ్‌ మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. గ్రామ గ్రామాల్లో పార్టీ సభ్యత నమోదు చేయడం జరుగుతుందన్నారు. పోచ్చన్న, గంగాధర్‌, నరేశ్‌, రామన్న, శ్యామ్‌ పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం



సన్మానిస్తున్న గోపాలమిత్రలు

తాంసి: భీంపూర్‌ మండల పశువైద్యాధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పశువైద్యాధికారి సుభాష్‌ రాథోడ్‌ను ఆదివారం సన్మానించారు. కరంజి(టి)లో పశువైద్య కేంద్రంలో మండలానికి చెందిన గోపాలమిత్రలు పశువైద్యాధికారి సుభాష్‌ రాథోడ్‌తో పాటు జూనియర్‌ పశువైద్యాధికారి రమణయ్యను శాలువాతో సత్కరించారు. మండలంలో రైతులకు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు ప్రవీణ్‌, మల్లిఖార్జున్‌, నవీన్‌, అజయ్‌, సంతోష్‌, శ్రీకాంత్‌, పాల్గొన్నారు.